శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై! సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై!



# గురుకృప

సద్గురు భక్తవిజయం



## గురుపూర్ణిమ సంచిక

గురోవినతిమీ కరీ హృదయ మందిరీ యా బసా ! సమస్త జగ్‌హే గురు స్వరూప చీ ఠసో మానసా !
కరో సతత సత్కృతీ మతిహిదే జగత్పావనా

# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...




ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి.!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాధుని అనన్య ప్రేమతో ఆర్ధతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీ బాబూజీ

## లీలలు - పుటలు


| | | | |
|---|---|---|---|
| 1. సాయివంటి దైవంబు లేడోయి..లేడోయి... | శ్రీ బాబూజీ | .................... | 2 |
| 2. ఉన్నమాట - అనుకున్నమాట | గురుబంధువులు | .................. | 3 |
| 3. తండ్రికి తగ్గ బిడ్డలమా? | వి. కిరణ్‌కుమార్ | .................. | 6 |
| 4. నేనున్నాను నిండుగా | కిరణ్ | .................. | 9 |
| 5. ఆ ఒక్కమాట - చూపెను సాయిబాట | వెంకటేష్ | .................. | 11 |
| 6. చిన్ని ఆశ-పెద్ద ఆనందం | రేణుక | .................. | 14 |
| 7. సమస్య-సమాధానం-సంతృప్తి | గాయిత్రి అనిల్ | .................. | 15 |
| 8. నిశ్చింతకు నిధానం-సద్గురు సన్నిధానం | సతీష్ | .................. | 17 |
| 9. ఊదీ-ఉత్తరం-ఉపశమనం | ఆర్.స్వామి | .................. | 19 |
| 10.రసస్పందన | గురుకృప | .................. | 20 |




సంపుటి : 10
సంచిక : 3

త్రైమాసిక పత్రిక
జూలై 2007

నిర్వహణ

గురూజీ
ఆశీస్సులతో
గురుబంధువులు

చిరునామా

గురుకృప
2-1-6,
గాంధీచౌక్,
తెనాలి-01

ఫోన్:

08644-227194

ముద్రణ

రామకృష్ణ ప్రింటర్స్
విశాఖపట్నం

ఫోన్స్ :
2798072
2740222


**శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై!**
**సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై!**

# గురుకృప

## ఉన్నమాట - అనుకున్న మాట

ప్రజలందరినోట సాయినామం పలకాలి! సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి. ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి! అన్న గురుదేవుల ఆకాంక్షకు రూపుగా, సద్గురు అనుగ్రహ రవళులు మన హృదయ కుహరాలలోని నిశ్శబ్ద నిశీధిలో ప్రతిధ్వనించేందుకు ఒక వేదికగా సాయిపూజా మహోత్సవాలు కన్నుల పండుగగా జరిగాయి. వేలాదిగా తరలి వచ్చిన సాయిభక్తులంతా 'శ్రీ సాయి స్మరణలో తనువంతా నిండిపోవాలన్న' ఒకే ఒక లక్ష్యంతో చేసుకున్న ఈ స్మరణోత్సవాలు గురుబంధువులందరినీ ఆనంద సంద్రంలో ఓలలాడించాయని చెప్పడంలో అతిశయోక్తి లేదేమో!

ఈ జగమంతా సద్గురు (అనుగ్రహాశీస్సులతో) స్మరణతో నిండి, మనందరి జీవితాలకు కొత్తదనాన్ని అందించాలని, గురుపూర్ణిమ వెన్నెలలో సద్గురుస్మృతులు ఒక మధురానుభూతిని మిగల్చాలని గురుదేవులను వేడుకుంటూ, 'గురుకృప' గురుబంధువులందరకు గురుపూర్ణిమ శుభాకాంక్షలు తెలుపుతోంది. **గురుపూర్ణిమ** ఆధ్యాత్మిక సాధనా సౌధానికి మూలస్థంభమైన సద్గురువును శ్రద్ధా భక్తులతో స్మరించుకొని, పూజించుకునే ఒక మహత్తర అవకాశం. గురుపూర్ణిమకున్న చారిత్రక కోణాన్ని పరిశీలిస్తే వేదాలకు, పురాణాలకు ఆద్యుడైన వ్యాసుని స్మరించుకునేందుకు, కాలం రీత్యా ప్రారంభమయ్యే నూతన ఆయనాన్ని స్వాగతించేందుకు జరుపుకునేది గురుపూర్ణిమ. పూజ్య బి.వి. నరసింహస్వామీజీ మాటల్లో చెప్పాలంటే "వర్షాలతో ఇబ్బందిపడుతూ వాతావరణ మార్పులతో సాగే ఈ రెండు నుంచి నాలుగు నెలల కాలం సద్గురు భక్తులకు పండుగ వాతావరణమని చెప్పాలి. ఎందుకంటే గురువుకు



వారింట ఆతిధ్యమిచ్చి, వారి నుండి సత్సంగం గురించి, సాధన గురించి, యోగాన్ని గురించి, తత్త్వాన్ని గురించి, ఇలా ఎన్నో రకాలుగా తెలుసుకుని గురుమార్గంలో సాగిపోయేందుకు ఒక చక్కటి అవకాశానికి నాంది గురుపూర్ణిమ" అంటారు. ఇదీ చారిత్రక ప్రాధాన్యం. సాయిపథంలో శ్రీ సాయి తన భక్తులకు చెప్పి చేయించిన ఒకే ఒక్క పండుగ "గురుపూర్ణిమ". గురుపూర్ణిమ నేపథ్యంలో గురుదేవుల బోధను తెలుసుకుందామనే గురుబంధువులు **'గురుపూర్ణిమ' 2006 గురుకృప సంచికలోని ఉన్నమాట–అనుకున్నమాటను అవధరించడం ఆనందదాయకం.** నిత్య ఆచరణాత్మకం. పూజ్య గురుదేవులు ఒక గురుపూర్ణిమకు చేసిన సత్సంగాన్ని, సాయిచరిత్ర మనకు అర్ధమయ్యే రీతిలో చేసే ప్రబోధాన్ని గురుదేవులు మనకిచ్చే సూచనను గమనించుకుని ఈ పూర్ణిమను – నిజమైన 'గురు'పూర్ణిమగా మలచుకోవాలని ఆకాంక్షిస్తోంది గురుకృప.

"శ్రీ సాయికృప మనమీద ఎప్పుడూ వర్షిస్తూనే ఉంది. రకరకాల పరిస్థితుల రూపంలో, రకరకాల సంఘటనల రూపంలో మనకు చూపిస్తూనే ఉన్నారు. కానీ మనం దాన్ని గుర్తించడంలేదు! గుర్తిస్తే మన మనసు కృతజ్ఞతా భావంతో నిండిపోతుంది. ఇంకా ఇంకా ప్రోత్సాహకరంగా మనం ముందుకు పోగలం." సద్గురు అనుగ్రహాన్ని గుర్తింపులో ఉంచుకొని, కృతజ్ఞతతో మనం చేయవలసిన పని సమయాన్ని సద్వినియోగం చేసుకోవడమే! వ్యర్ధ సంభాషణలలో, పరనిందా ప్రసంగాలలో మనం పాల్గొనకుండా ఉండడమే! శిరిడీ వచ్చి పరనిందలో పాల్గొనే వ్యక్తిని పంది అశుద్ధాన్ని తినడంతో పోల్చిన తీరు చరిత్రలో చూసాం. మహాకవి కాళిదాసు కూడా ఇటువంటి ఉపమానాన్ని చెప్పిన సందర్భం లేదు" అంటారు గురుదేవులు. బాబా తన భక్తులను సంస్కరించే తీరు కూడా ఎంతో ఉన్నతంగా ఉండడం మనం చరిత్రలో గమనించవచ్చు. శ్రీ సాయివద్ద సంస్కరించబడిన భక్తులలో శ్రీ ఖాపర్డే మనకు సుపరిచితులు. ఒకరోజంతా తన మిత్రులకు లేఖలు రాయడంలో సమయాన్ని వెచ్చించిన ఖాపర్డేతో సాయి అంటారు ఎత్తి పొడుపుగా " ఇంకా నయం, కనీసం నీ చేతులకైనా పని చెప్పావు!" అని. మరోరోజు ఆరతికి కూడా మశీదు చేరాక నిద్రిస్తున్న ఖాపర్డేను చిత్రంగా లేవగొడతారు. ఇక జనవరి 12, 1912 నుండి ఫిబ్రవరి 6, 1912 వరకు ఖాపర్డే డైరీని పరిశీలిస్తే సాయి ఎన్నిసార్లు ఖాపర్డేను సమయం గురించి హెచ్చరించారో, సమయాన్ని సద్వినియోగం చేసుకున్న సందర్భంలో సాయి అనుగ్రహాన్ని ఖాపర్డే ఎంతగా ఆస్వాదించగలిగాడో మనం చరిత్రను ఒకసారి అవలోకిస్తే అవగతమవుతుంది. వ్యర్ధ సంభాషణల గురించి గురుదేవుల మాటలను గమనిద్దాం– "మనకు గాని, ఎదుటివారికి గాని, ఆ స్ధలంలో లేని మూడవవారికి గాని, ఉపయోగం లేని మాటలను మాట్లాడకుండా



ఉండడం, ఉపయోగం అంటే, నేను అది ఆధ్యాత్మికమైందని చెప్పడంలా! ప్రాపంచికమైనదైనా సరే, మనకన్నా, ఎదుటివాడికన్నా, అక్కడలేని మూడోవ్యక్తి కన్నా ఉపయోగం ఉండాలా!"

సాయి చర్యలు, గురుదేవుల మాటల వెనుక అంతరార్థాన్ని మనం విశ్లేషించుకోవడం అత్యావశ్యకం. ఎందుకంటే 'గురుపూర్ణిమ' సద్గురు భక్తులకు నూతన సంవత్సర ప్రారంభం లాంటిది. సంవత్సర ప్రారంభంలోనే మనకు మనం సద్గురు అనుగ్రహంతో దిశానిర్దేశాన్ని చేసుకోవడానికి ఒక ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగిపోయేందుకు ఇంతకంటే మంచి సందర్భం లేదనే చెప్పాలి. శ్రద్ధా భక్తులతో సద్గురుని చేరి బండ్ల కొద్దీ జ్ఞానాన్ని తెచ్చుకునేందుకు నాందీ ప్రస్తావన గురుపూర్ణిమ. ఒక్క మాటలో చెప్పాలంటే " మన జీవితాలను సద్గురుమయం చేసుకోవడానికి గురుపూర్ణిమను మించిన సందర్భం మరొకటి లేదు." గురుబంధువులందరం ఒకేఒక సమున్నత లక్ష్యంతో ముందుకు సాగే సందర్భమిది. వ్యర్థ ప్రసంగాలకు, వాదాలకు, పరనిందా ప్రసంగాలకు తావులేని గురువత్సరాన్ని గడిపేందుకు సంసిద్ధమవుదాం. గురుపూర్ణిమ రోజు మొత్తాన్ని కేవలం గురుస్మరణలో గడిపే ప్రయత్నం చేద్దాం. మన మాటలు, చేతలు, అన్నీ కేవలం సద్గురువునే గుర్తుకు తెచ్చేవిగా గడుపుదాం, గురునామాన్ని స్మరిద్దాం. సద్గురువును పూజించుకుందాం, గురులీలలను మననం చేసుకుందాం, ఇతరులతో పంచుకొని పరవశిద్దాం. సద్గురువనే ఆనంద స్వరూపాన్ని ధ్యానిద్దాం. సద్గురువును కీర్తించుకుందాం. శిరిడీ వంటి పవిత్రక్షేత్రంలో అణువణువునా అలరారే సద్గురుతత్వాన్ని దర్శించుకుందాం. ఇలా జరుపుకునే గురుపూర్ణిమ మనలో ఎంతో పరివర్తనను తీసుకువస్తుందంటారు పూజ్యశ్రీ బి.వి. నరసింహస్వామీజీ. వారి మాటల్లో చూస్తే "కేవలం సద్గురువనే ధ్యాసలో ఊసులో గడిపిన భక్తునికి ఆ సంవత్సరమంతా మరింతగా గురుమార్గంలో సరియైన అడుగులు వేసేందుకు, కావలసిన శక్తిని, సామర్థ్యాన్ని ఇవ్వడమేగాక, సద్గురుపథంలో సూటిగా సాగిపోయేందుకు అందివచ్చే ప్రతీ వనరును సద్వినియోగ పరచుకునే అవకాశం లభిస్తుంది." శిరిడీ వంటి పవిత్ర క్షేత్రాలను సందర్శించడంలో మన లక్ష్యమేమిటి, మనం ఎలా ఉండాలనేది గురుదేవుల మాటలలోనే గమనించుకొని గురుపూర్ణిమను శోభాయమానంగా మలచుకుందాం.

"ఈ ఒక్క విషయం గమనించుకోండి. రోజు మొత్తాన్ని మనం ఎలా గడిపాం! ఒక్క రోజు – ఎలా గడిపామో మనకు మనం సమీక్ష చేసుకోవాలి. ఇక్కడకు ఎందుకు వచ్చాం? ఇక్కడ ఏం చేస్తున్నాం? మన ఆశయమేమిటి? ఎటువైపు మన పయనం?"

**– గురుబంధువులు**





# తండ్రికి తగ్గ బిడ్డలమా?

'గురుకృప' ఒక చిన్న ఆనందకరమైన సంఘటనను మీతో పంచుకుంటోంది. ఈ గురుబంధువు అనుభవంలో వ్రాసి ఉన్న ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసి మాట్లాడగా సాయిపథం యువతకు జీవితం పట్ల ఉన్న అవగాహన వ్యక్తం అయ్యింది. పెద్దలను గౌరవించకపోవడమనే దురలవాటు నుంచి వినయంగా మాట్లాడటమనే మంచి గుణాన్ని శ్రీ బాబూజీ అలవరిచారు అని చెప్పడం తటస్థించింది. అంతేకాక, "నా ఆశయాల పట్ల నాకున్న అంకితభావం నుంచి నేను దూరంకాను. అయితే, మా అమ్మ,నాన్న, తమ్ముడు.. ఇలా నా కుటుంబాన్ని మాత్రం గురుదేవుల అనుగ్రహంతో ఎంతో ఉన్నతంగా చూసుకోవాలన్న ఆశ గురుదేవుల చెంతకు చేరాక, ఆశయమైంది" అని అంటూ ఈ గురుబంధువు చెప్పిన మాటలు ఉత్సుకతను రేకెత్తించాయి. ఈ గురుబంధువుకు బాబాపట్ల, గురుదేవుల పట్ల ఉన్న ప్రేమను చూసి, అమ్మ,నాన్నకూడా శ్రీసాయిని, శ్రీ బాబూజీని పూజించుకుంటున్నారు అంటూ తన ఆనందాన్ని పంచుకున్నాడు. సద్గురువు మనపై వర్షిస్తున్న ప్రేమను అందరితో పంచుకొని, సాయైక ప్రపంచంగా మన పరిధులను విస్తరించుకున్ననాడే మనం తండ్రికి తగ్గ బిడ్డలమవ్వగలము.

**– గురుకృప**

నాపేరు కిరణ్‌కుమార్. మాది ప్రకాశం జిల్లాలో దరిశి గ్రామం. నాకు చిన్నప్పటి నుండి "బాబా" అంటే చాలా ఇష్టం. అయితే నేను బాబా గుడికి ఎప్పుడూ వెళ్లలేదు. అయినా ఎందుకో బాబా అంటే ఎంతో ప్రేమ. నా బుక్స్‌లో బాబా పేరుతోనే మొదలు పెడతాను. అలా నా చిన్నతనం గడిచింది. తరువాత మొట్టమొదటిసారిగా నా ఇంటర్మీడియట్‌లో బాబా మందిరానికి వెళ్లాను. అదీ నా స్నేహితుని బలవంతంతోనే వెళ్లాను. అయితే అక్కడ మొట్టమొదటిసారిగా గురువుగారిని అక్కడ ఫొటోలో చూసాను. అప్పుడు ఆయన ఎవరో నాకు తెలియకపోవడంతో నేను ఆయనకు నమస్కరించలేదు. అలా నా స్నేహితుని బలవంతం వల్ల మందిరానికి ప్రతి గురువారం రావాలి అనే ఆలోచన నాకు కలిగింది. అలా రావడం వల్ల గురువుగారి గురించి తెలుసుకున్నాను. అలా సత్సంగాలకు కూడా హాజరు అయ్యేవాడిని. సత్సంగంలో అందరూ బాబా నామం చెప్తూ ఉంటారు. నాకు చెప్పాలనే ఆశ. కంజర ప్లే చేయాలి అని ఆశ ఉండేది. అప్పుడు నేను గురువుగారిని మొట్టమొదటిసారిగా ఒక కోరిక కోరాను. నేను కూడా కంజర ప్లే చేయాలి, నామం చెప్పాలి అని, ఏదో మామూలుగా అడిగాను. వెంటనే రెండు నిమిషాలలో నా ముందు కూర్చుని కంజర ప్లే చేస్తున్న





వ్యక్తి ఆ కంజర నా చేతికి ఇచ్చి నామం చెప్పమన్నారు. నేను ఒక్క క్షణం షాక్ అయ్యాను. ఎలా చెప్పాలో నాకు తెలియదు అయినా గురువుగారికి నమస్కరించుకొని బాబా నామం స్టార్ట్ చేసాను. ఎలా చెప్పానో తెలియదు. అందరూ బాగా చెప్పావు అని అన్నారు. నిజంగా గురువుగారి దయవల్లే అంత ధైర్యం వచ్చింది. అప్పటి నుండి గురువుగారిని అనుక్షణం తలచుకుంటూ ఉండేవాడిని. గురువుగారి అనుగ్రహంతో హైదరాబాద్‌కి రావడం, అక్కడి గురుబంధువులతో పరిచయం నాకు ఎంతో ఆనందమును కలిగించింది. మొట్టమొదటిసారిగా 2003 గురుపూర్ణిమకు "శిరిడీ"లో గురువుగారిని కళ్లారా చూసే భాగ్యం కలిగింది. ఎందుకో తెలియదు ఆయనను మొట్టమొదట చూడడంతోనే నా కళ్లవెంట నీరు కారింది. అలానే చూస్తూనే ఉండిపోయాను. అలా గురువుగారితో నాకు అనుబంధం ఏర్పడింది. అప్పటి నుండి ఇప్పటి వరకు ప్రతి సం॥ బాబా, గురూజీని దర్శించుకుంటూనే ఉన్నాను.

2007 న్యూ ఇయర్ రోజున నేను శిరిడీలో ఉన్నాను. న్యూ ఇయర్ ఇంకొక 5 ని॥లలో వస్తుందనగా గురువుగారు స్టేజ్ మీదకు వచ్చారు. మా అందరితోపాటు గురువుగారు న్యూ ఇయర్ రోజున బాబా నామంలో పాల్గొనడానికి వచ్చారు. న్యూ ఇయర్ నా లైఫ్‌నే మార్చి వేసింది. నేను మంచి జాబ్ చేయాలి, మంచి జీతంతో సెటిల్ అయితే అమ్మ, నాన్నను, తమ్ముడును అందరినీ బాగా చూసుకోవచ్చు అని. అందరినీ అడిగితే "మల్టీమీడియా"బూమ్ బాగుంది. చేయాలనుకుంటే చేయి అని చెప్పారు. నేను ఇదంతా ఒకసారి గురువుగారికి చెప్పుకొని, గురువుగారి ఆశీస్సులతో చేరదాం అనుకున్నాను. బాబా నామం నుండి గురువుగారు తిరిగి వెళుతుండగా అందరూ బయట నిలబడి ఉన్నారు. నేను కూడా అందరిలో నిలబడి ఉన్నాను చెపుదాం అని. అయితే గురువుగారు కరెక్ట్‌గా నా దగ్గరకు వచ్చే టైమ్‌కు అప్పటిదాకా చెపుదాం అనుకున్న వాడిని గురువుగారు దగ్గరకు వచ్చి నా కన్నుల్లోకి చూసారు. అంతే! నా మాట ఆగిపోయి నా కన్నీళ్లతో నా బాధను వ్యక్తం చేసుకున్నాను. గురువుగారు నవ్వుతూ నన్ను ఆశీర్వదించారు. కాని నేను నోరువిప్పి చెప్పలేకపోయాను. తరువాత నరేంద్ర అన్నను కలిసినపుడు జరిగిన విషయం చెపుతూ అన్న నాకు మల్టీమీడియా చేయాలని ఉంది, చేయమంటారా అని అడిగాను. అన్న 'గురువుగారికి చెప్పుకోరా' అని అన్నారు. "అన్నా చెపుదాం అనుకునే వెళ్లాను. ఆయన నా కన్నులవైపు చూడడంతో ఏడ్చేసాను" అని చెప్పాను. "సరే! నువ్వు తరువాత ఫోన్ చెయ్యిరా" అని అన్నారు.





తరువాత నేను హైదరాబాద్ వచ్చి నాలుగురోజుల తరువాత ఫోన్ చేసాను. అన్నను అడగగా, 'ఓకే! మంచి ఇన్‌స్టిట్యూట్ ఎంచుకోరా' అన్నారు. శిరిడీలో ఇంతకు ముందే అంటే న్యూ ఇయర్ రోజున అన్నతో మాట్లాడినపుడు మా ఇంటి పరిస్థితి గూర్చి చెప్పాను. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నాం అన్నా! మల్టీమీడియా చేయాలంటే వేలు కావాలి. ఇంట్లో అంత అవకాశం లేదు అని చెప్పాను. అప్పుడు అన్న గురువుగారికి చెప్పుకోరా బాధపడకు అని అన్నారు. న్యూ ఇయర్ రోజున శిరిడీలో అనుక్షణం బాబా, గురుదేవులకు చెప్పుకుంటూనే ఒక అప్లికేషన్ పెట్టుకున్నాను. సంక్రాంతికి అమ్మవాళ్లు ఇంటికి రమ్మన్నారు. నేను ఎందుకులే అనుకుంటూనే బయలుదేరాను హఠాత్తుగా. మల్టీమీడియా గురించి చెప్పుకొని అమ్మ నాన్నని ఒప్పిద్దాం అనుకున్నాను. ఊరు వెళ్లి రెండు రోజులు అయ్యింది.  మానాన్న హఠాత్తుగా ఫోన్ చేసారు. ఎక్కడ ఉన్నావురా అని. నేను బయట ఉన్నా నాన్న అని చెప్పాను. తొందరగా ఒకసారి ఇంటికి రా! అని అన్నారు. నేను ఏమైందా అని వెళ్లాను. అమ్మ, నాన్న ఎప్పటి నుండో మాకు ఉన్న స్థలం మా చదువుకోసం అమ్ముదాం అనుకొని మంచి రేట్ రాకపోవడంతో ఆగిపోయారు. కాని పాతరేటుకంటే ఆరు రెట్లకు ఆ స్థలం నాకు తెలియకుండానే అమ్మవాళ్లు అమ్మేసారు. నేను ఒక్కక్షణం షాక్ అయ్యాను. జనవరి 1న గురుదేవుల దర్శనం చేసుకొని, ఊరికి వచ్చి, అప్పటికి 12 రోజులు మాత్రమే.

స్థలంకు మంచి రేటు రావడంతో  నా ఇబ్బంది తొలగిపోయింది. వెంటనే గురువుగారికి నమస్కారం చేసుకుని తిరిగి హైదరాబాద్ వచ్చి, అన్నకు ఫోన్ చేసి విషయం చెప్పి, ఇన్‌స్టిట్యూట్ వెతకడం మొదలుపెట్టాను. ఎక్కువ మొత్తం ఫీజు తీసుకునే ఇన్‌స్టిట్యూట్ కాకుండా నాకు తగ్గట్లుగా నేను తెలుగుమీడియం అవడంతో పక్కా తెలుగు ఫ్యాకల్టీతో మంచి ఇన్‌స్టిట్యూట్‌లో చేర్పించారు గురువుగారు. అలాగే ఇంట్లో ఇబ్బంది తొలగిపోయి నాన్న బిజినెస్ కూడా బాగా ఉండేలా చేసారు. తమ్ముడు చదువుకు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చేసారు గురువుగారు.

**– వి. కిరణ్‌కుమార్, దరిశి.**

**నావ ఎటుతిరుగుతున్నా, దిక్సూచి ఉత్తర దిక్కునే చూపుతుంది. అలానే ఇంద్రియాలు ఏ కర్మలాచరిస్తున్న మనసు గురువుయందే లగ్నం కావాలి.**

**గురువు వ్యక్తి కాదు. శక్తి. జీవన శక్తి. జీవికి శక్తి.**



# నేనున్నాను నిండుగా

చరిత్రకారులకందిన  సాయిలీలలు, సాయి భక్తుల సంఖ్య గమనిస్తే సాయి చరిత్ర మనకు సంపూర్ణంగా అందిందా అంటే సందేహమే! అయితే, సాయి మాత్రం మనకు అవసరమైనంత మేర హేమాడ్‌పంత్, శ్రీ నరసింహస్వామీజీ వంటి భక్తులను మిషగా చేసుకొని చరిత్రను గ్రంథస్తం చేయించారు. అయితే, ఇందుకు భక్తులకు బాబా పట్ల ఉన్న ప్రేమానురాగాలు–చరిత్రకారులతో పంచుకోవడం ద్వారానే  బాబా ప్రేమ మనపై వెల్లువలా కురిసిందనడంలో అతిశయోక్తి లేదు. ఆ భక్తుల లీలలే నేడు మనకు ప్రేరణలు. ఈ పంచుకోవడం–సద్గురువు పట్ల ప్రేమను పెంచుకోవడానికే. జీవితంలో జరిగే ప్రతీ సంఘటన సద్గురు లీలా ప్రభోదమేనని అవగతం చేసుకోవడానికి ఒక గురుబంధువు పంచుకున్న అనుభవం మరో గురుబంధువుకు ప్రేరణనివ్వడం–ఇది ఎలా జరిగింది, ఈ లీల చదివితే....

**– గురుకృప**

నా పేరు కిరణ్. నేను హైదరాబాద్‌లో ఉంటాను. గురువుగారి ద్వారా పొందిన అనుభవాన్ని అందరితో పంచుకుంటున్నాను. ఒంగోలు సాయిబాబూజీ నగర్ మందిరంలో ప్రతి ఆదివారం జరిగే నామంలో పాల్గొనడానికి హైదరాబాద్ వాళ్లందరం కలసివెళ్లాము. ఆరోజు అనుభవాలు పంచుకునే కార్యక్రమంలో కర్నూల్ రాజశేఖర్ తన అనుభవాన్ని చెబుతూ ఏ పని అయినా చేయబోయేముందు బాబాకు, గురువుగారికి చెప్పి చేస్తే దాని ఫలితం బాగుంటుందని తన అనుభవం చెప్పాడు. అది నాకు బాగా నచ్చింది. నేను కూడా అదే పద్ధతిని ప్రారంభించాను. ఈ మధ్య మా నాన్నగారికి శుక్లం ఆపరేషన్ చేయించడానికి హాస్పిటల్‌కి వెళ్లబోయేముందు గురువుగారికి మెయిల్ చేసి బయలుదేరాను. ఆ మెయిల్‌లో ఏమి వ్రాసానంటే, గురువుగారు ఈరోజు మా నాన్నగారికి ఆపరేషన్ జరగబోతుంది. సర్జరీ జరిగినంతసేపు మీరు, బాబా మా నాన్నగారితోనే ఉండాలి. మీరు ఉండడమే కాదు, మీరు ఉన్నట్టు నాకు తెలియచేయాలి అని అడిగాను. మా నాన్నగారిని థియేటర్‌లోనికి తీసుకొని వెళ్లారు. తరువాత నేను, మా అమ్మ బయట లాంజ్‌లో వెయిట్ చేస్తున్నాము. అప్పుడు ఒక సెక్యూరిటీ అతను వచ్చి కొన్ని న్యూస్ పేపర్స్ అక్కడ పెట్టి వెళ్లిపోయాడు. నేను ఖాళీగా ఉన్నానని ఆ పేపర్స్ చూసాను. ఆరోజు శుక్రవారం. అక్కడ పెట్టిన పేపర్స్‌లో  ముందురోజు అనగా గురువారం పేపర్ కూడా ఉంది. ప్రతి గురువారం వార్త పేపర్‌లో బాబా గురించి ఆర్టికల్ వేస్తారు. ఆ గురువారం ఆర్టికల్ **“నేనున్నాను నిండుగా”** అన్న పేరుతో ఉంది. దాన్ని చూడగానే నేను గురువుగారిని అడిగిన ప్రకారం



బాబా మాతో ఉన్నారు అన్న ఎరుక కలిగింది. కానీ ఎక్కడో అనుమానం అది నాకు అనుభవమా? కాదా? అని. ఇంతలో సర్జరీ పూర్తయింది. మా నాన్నగారికి లైఫ్‌లో మొదటిసారి సర్జరీ జరిగినా చేయించుకున్న ఫీలింగ్ లేదు. చాలా సంతోషముగా ఉంది అన్నారు.

నాకు ఏ అనుమానం ఉన్నా ఎటువంటి సందేహం వచ్చినా గురువుగారి నోటి వెంట దానికి సమాధానం వింటాను. అది సత్సంగాల రూపంలో గాని, కలలుగా కాని ఎలాగో నాకు గురువుగారి దగ్గర నుండే సమాధానం లభిస్తుంది. అది నాకు గురువుగారు ఇచ్చిన గొప్ప అనుభవం. నాకు ప్రతిరోజు పడుకొనేటప్పుడు గురువుగారి ఆడియో ఏదో ఒకటి వింటూ పడుకునే అలవాటు. తరువాత గురువుగారు చేసిన సత్సంగం ఒకటి వింటూ ఉన్నాను. అందులో గురువుగారిని ఒక అతను తన సందేహం అడిగాడు. అదేమిటంటే గురువుగారూ! ఇక్కడయితే మా అనుమానాలు, సందేహాలు మీరు తీరుస్తారు. మేము అక్కడికి వెళ్లిపోతే మా అనుమానాలు ఎలా తీరుతాయి? అని అడిగాడు. దానికి గురువుగారు ఏం చెప్పారంటే, “నీకు అనుమానం ఉంటే బాబాను గట్టిగా ప్రార్ధన చెయ్యయ్యా! వెయ్యి మార్గాలలో బాబా నీ అనుమానం తీరుస్తారు. ఆ వెయ్యి మార్గాలలో నేను ఒకడిని. అని గురువుగారు తమ అనుభవాన్ని షేర్ చేసుకున్నారు. “అదేమిటంటే, నేను 18 సం॥ వయసులో శాస్త్రాల గురించి బాగా అధ్యయనం చేస్తుండేవాడిని. అప్పుడు ఒక శ్లోకం యొక్క మూలం నాకు తెలియలేదు. అప్పుడు మా కాలేజ్‌లో బాత్‌రూమ్స్ ఉండేవికావు. నాలుగు గోడలు అలాగ కట్టి ఉండేవి. తలుపు కూడా ఉండేది కాదు. చెంబు పైన పెడితే లోపల మనిషి ఉన్నట్లు లెక్క. బాత్‌రూమ్‌కి వెళ్లాను. ఆ శ్లోకం యొక్క మూలం గురించే ఆలోచిస్తున్నాను. ఈలోగా పెద్ద గాలి వచ్చి ఒక చుట్టుచుట్టి పడేసిన కాగితం వచ్చి ముఖానికి ఫట్‌మని తగిలింది. ఖాళీగా ఉన్నాను కదా ఆ సమయంలో, అని ఆ కాగితం తీసి చూసాను. ఆ కాగితంలో నాకు కావలసిన శ్లోకం, దాని మూలం అన్నీ ఉన్నాయి. ఎవరు చెబితే వచ్చింది ఇది? ఆయన మన అనుమానం తీర్చదలచుకుంటే కక్కరసులో ఉన్న కాగితం కూడా మనకు సమాధానం చెబుతుంది” అని చెప్పారు. ఈ అనుభవం విన్నాక నాకు ఉన్న అనుమానం అంతా తీరిపోయింది. నేను ఆరోజు పేపర్‌లో బాబా ఆర్టికల్, బాబా ఫోటో చూడడం గురువుగారు నాకిచ్చిన అనుభవం అని అర్ధమయ్యింది.

**–కిరణ్, హైదరాబాద్**



## ఆ ఒక్కమాట - చూపెను సాయిబాట

విశిష్టమైన సాయిపథంలో సత్సంగానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చారు గురుదేవులు. సాయిపథంలో తొలి అడుగు సత్సంగనుంచే ప్రారంభమవుతుంది. మనం సాయికి చెందిన వారమనే భావనను బలపరచి, సాయితో అనుబంధాన్ని ధృఢపరుస్తుంది. ఎందరో గురుబంధువులకు సాయి అనే లక్ష్యంవైపు తొలి అడుగులు శ్రీ బాబూజీ అందించిన సత్సంగం నుంచే ప్రారంభం అయ్యాయి. ఈ తొలిఅడుగు ఒక నూతన జీవన విధానాన్ని అందించిందనేందుకు ఈ యువ గురుబంధువు అనుభవం ఒక వ్యాఖ్యానం లాంటిది. ఆనందంగా సాగిపోయే జీవనయానంలో సద్గురువుతో ప్రేమానుబంధం పెరిగిన కొద్దీ, పెరిగే కలుపును కూడా పీకివేయడం జరుగుతుంది అని తెలుపుతోంది ఈ అనుభవం. **కలుపు జాడ లేదు–కల్మషమైన చిత్తాలు లేవు, సాయిపథమంటే ఒక ఆనంద జీవన విధానం.** **– గురుకృప**

పిల్లలు సరియైన మార్గంలో నడువనపుడు తల్లిదండ్రులు వారిని సన్మార్గంలో నడిపించుటకు చేసే ప్రయత్నాలు పిల్లలపైన ప్రభావం చూపుతాయి. అది పిల్లలు గ్రహించే విధానాన్ని బట్టి మంచి చెడులను నిర్ణయిస్తుంది. పూజ్య గురుదేవులు బాబూజీ ప్రేమతో నన్ను కాపాడేందుకు నామీద ప్రయోగించిన అస్త్రాన్ని బాబా, గురుదేవుల ఆశీస్సులతో మీ అందరితో పంచుకునే ప్రయత్నం చేస్తాను. ముందుగా బాబాకు మరియు గురుదేవులకు నా సాష్టాంగ నమస్కారములు తెలియచేసుకుంటున్నాను. నాపేరు వెంకటేష్. మాది నెల్లూరు దగ్గర రామారెడ్డిపాలెం అనే గ్రామం (కోట దగ్గర). హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాను. నా స్నేహితుడి ప్రోద్బలంతో 2002 దసరాకు మొట్టమొదటిసారిగా శిరిడీ వెళ్లడం జరిగింది. మొదటిసారే నాకు గురువుగారి దర్శనం చేసుకునే భాగ్యం లభించింది. అయితే అప్పటికి నాకు బాబా గురించి కాని, గురువుగారి గురించి గాని ఏమీ తెలియదు. కాని వారి సంకల్పం ప్రకారం నాకు గురువుగారి ఊదీ దర్శనం లభించింది. మేమందరం చాలా సంతోషంగా ఫీల్ అయ్యాము. అలా 5 రోజులు శిరిడీలో గడిపి వచ్చేసాము. మరలా 2003 నవంబర్‌కి శిరిడీ వెళ్లాము. జనవరి 1వతేదీకి అక్కడికి చేరుకున్నాము. ముందుగా బాబా దర్శనం చేసుకున్న తరువాత సాయియానాకు వెళ్లి సాయంత్రం వరకు అక్కడ భజనలో ఉన్నాము. మా ఆత్రుత అంతా గురుదేవుల దర్శనం కోసమే. సాయంత్రం గురుదేవుల గురించి కొందరిని అడిగాము. మాకు సరియైన సమాచారం లభించలేదు. గురువుగారు ఇంకా రాలేదని కొందరు, తెలియదని కొందరు



చెబుతున్నారు.మేము ఇక రూముకి వెళ్లి పడుకున్నాము. తెల్లవారి కాకడ ఆరతికి వెళ్లి, సుమారు 7 గం॥ల ప్రాంతంలో సాయియానాకు వచ్చాము. అక్కడ గురుదేవుల ఊదీ దర్శనం గురించి అడిగాము. అపుడు వారు చెప్పింది విన్నాక మా శరీరాల్లో తడిలేదు. అరే! గురువుగారు 5 గం॥ల వరకు పేరు పేరునా పిలిచి అందరికీ ఊదీ ఇచ్చారయ్యా! కుండపోతవలె వర్షించిన గురువుగారి దర్శనంలో మీరు లేరా? అయ్యో! ఇక గురువుగారి ఊదీ దర్శనం ఉండకపోవచ్చు అని అన్నారు. మాకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఈ విషయాన్ని మేం జీర్ణించుకోలేకపోయాము. అప్పుడు అక్కడే వున్న నరేంద్రసార్‌ని కలిసి మా బాధను విన్నవించుకున్నాము. వారు మమ్ములను సూటిగా ఇలా అడిగారు. “మీరు ఎక్కడినుండి వచ్చారు? మీరు అసలు సత్సంగాలకు వెళుతున్నారా?” మేము ఎక్కడి నుండి వచ్చామో చెప్పాము. కానీ సత్సంగాలకు వెళు తున్నారా అన్న ప్రశ్నకు మా దగ్గర సమాధానం లేదు. ఒకరి ముఖాలు మరొకరు చూసుకోవడం తప్ప! వారికి విషయం అర్థం అయిందనుకుంటాను. మేం సత్సంగాలకు వెళ్లటం లేదన్న విషయాన్ని గ్రహించి ప్రక్కనే ఉన్న శ్రీ గుప్తా గారిని చూపించి, వీరు నాంపల్లిలో ఉంటారు అని పరిచయం చేసారు. అప్పుడే శ్రీమతి భాగ్యలక్ష్మిగారు, శ్రీమతి రాజేశ్వరిగారు అక్కడికి వస్తున్నారు. అప్పుడు నరేంద్రసార్ వారిని పిలిచి మమ్మల్ని వారికి పరిచయం చేసి, వీళ్లు మన పిల్లలే. వీళ్లకి మీ సత్సంగ వివరాలు తెలియచేయండి అని చెప్పారు. అపుడు వాళ్లు ప్రేమతో మాకు అన్ని వివరాలు తెలియచేశారు. సాయంత్రం గురుదేవుల దర్శనం చేసుకున్నాము. అయితే మనస్సులో మాత్రం మేం అంతదూరం నుంచి మీ పాదదర్శనం కోసం వస్తే మమ్మల్ని దూరం చేసారు అని నిందిస్తూనే ఉన్నాము. అయితే అపుడు మాకు తెలియదు కదా వారు ఇవ్వదలచినదేంటో! అయితే అప్పటినుండి సత్సంగాలకు వెళ్లాలని మనసులో ఆరాటంగా ఉంది. హైదరాబాద్ వచ్చిన తరువాత జనవరి 20, 2003న బి.కె.గూడ సత్సంగానికి వెళ్లడం జరిగింది. ఆరోజు సత్సంగంలో మేము చాలా ఆనందించాము. సత్సంగం అంటే ఏమిటో తెలియకపోయినా ఆ అనుభూతి మాత్రం వర్ణించలేనిది. బాబా నామం చెబుతుంటే మనస్సు చాలా హాయిగా ఉంది. అప్పటి నుండి నిదానంగా సత్సంగానికి అలవాటుపడ్డాం. ఆ ఫలితమేనేమో వెంటనే ఉగాదికి శిరిడీకి వెళ్లే భాగ్యం కలిగింది. అపుడు గురుదేవుల ఊదీదర్శనం కూడా లభించింది. ఆ ఆనందం వర్ణించలేనిది. అపుడు గురుదేవులను నా జీవితం గురించి అడిగాను. నేను హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాను. అలాగే నాకు బిజినెస్ మీద కూడా ఆసక్తి ఉంది. నన్ను ఏం చేయమంటారు అని అడిగాను. గురుదేవులు కరుణతో, ప్రేమతో నా వైపుకు చూసి





"జాబ్ చేసుకో" అన్నారు. అలా అప్పటికే వ్యాపారంలో నా స్థాయికి మించి నష్టంలో వున్న నన్ను కాపాడారు. అప్పటి నుండి అర్థం అవుతూ వచ్చింది. సత్సంగ మహిమ అంటే ఏమిటో, సత్సంగంలో నేను పొందిన అనుభవాలు అనేకం. గురుదేవులు నామీద చూపిన ప్రేమకు నిదర్శనం ఇవాళ నేను ఈ సత్సంగంలో ఉండడం. ఆరోజు గురుదేవుల దర్శనం లభించలేదని భావించాము. కానీ ఈ సత్సంగానుభూతి ఎలా ఉంటుందో రుచి చూపడానికి గురుదేవులు అలా చేశారని అర్థం అయ్యింది. దానికి నిదర్శనం నరేంద్రసార్ "మీరు సత్సంగానికి వెళుతున్నారా?" అని అడగటమే ఎంత చక్కటి కూర్పు. అప్పుడే హైదరాబాద్ భాగ్యలక్ష్మిగారు అక్కడికి రావడం, మమ్మల్ని వారికి పరిచయం చేయడం, ఇవన్నీ చూస్తుంటే ఇదంతా గురులీల కాదంటారా! మామీద గురుదేవులు ఎంత ప్రేమ చూపుతున్నారో దీన్ని బట్టి అర్థం అవుతుంది. అలా ఆరోజు నుంచి సత్సంగంలో ఎన్నో అనుభూతులను నా సొంతం చేసుకున్నాను. నాకున్న ఒక చెడు అలవాటును గురుదేవులు ఎలా మాన్పించారో తెలియచేస్తాను. సాయంత్రం ఆఫీస్ నుంచి రూమ్‌కి నడుచుకుంటూ వెళ్లేవాడిని. అలా వెళ్లేటపుడు మెల్లిగా సిగరెట్ అలవాటు అయ్యింది. ఒకరోజు స్వప్నంలో గురుదేవులు అందరికీ ఊదీదర్శనం ఇస్తున్నారు. నేను అక్కడే ఉన్నాను. నేను అప్పుడే సిగరెట్ త్రాగి వారి దర్శనానికి వెళ్లాను. ఇదంతా వారు చూస్తునే ఉన్నారు. నేను వెళ్లే సరికి నావైపు కోపంగా చూస్తూ నన్ను దగ్గరకు రానివ్వకుండా చూసి వెళ్లిపోయారు. అలా వెళ్లేటపుడు నావైపే చూస్తున్నారు. తరువాత చాలా బాధపడ్డాను. గురువుగారి ప్రేమను దూరం చేసే ఈ సిగరెట్ నాకు అనవసరము అనిపించింది. అంతే అలా ఆ అలవాటు కలుపుదశలోనే పీకిపారేశారు గురుదేవులు. అలా నన్ను కాపాడారు.

ఇంకొక అనుభవాన్ని తెలియచేస్తాను. మొన్న మే 27కి గురుపూర్ణిమ మరియు దసరాకి శిరిడీ వెళ్లాను. అయితే ఈ మూడుసార్లూ గురుదేవులు నావైపు చూడడంలేదని చాలా కష్టంగా అనిపించింది. దసరా తరువాత అక్టోబర్ 7న R.K. గారింట్లో సత్సంగానికి వెళ్లాను. ఆరోజు బాబాకు మరియు గురుదేవులకు ప్రసాదం పెట్టమన్నారు. బాబాకు నివేదించి తరువాత గురుదేవులకు నివేదన చేస్తుండగా గురుదేవులు నావైపే చూస్తున్నారు. నాకు ఒక్కసారిగా కళ్లలో నీళ్లు తిరిగాయి. "ఇప్పటికైనా నీ కోరిక నెరవేరిందా" అని అంటున్నారు. నన్ను నేను ఆత్మ విమర్శ చేసుకున్నాను. గురుదేవులు చూడకపోతే శిరిడీ వెళ్లగలమా? ఇంతదూరం రాగలమా? ఆయన చూపు లేకుండా అసలు ఎలా? గురుదేవులను క్షమించమని వేడుకున్నాను. ఆరోజు ఆ ఒక్కలీలే జరిగి ఉండకపోతే నేనీరోజు ఈ సత్సంగానుభవాలను పంచుకునే భాగ్యాన్ని పొందేవాడిని.





కాదేమో! ఇది తెలుసుకోకుండా అనవసరముగా ఆరోజున గురుదేవులను నిందించినందుకు గురుదేవులు దయతో మమ్ములను క్షమించి, మేమందరం సత్సంగ పథంలో మరెన్నో అనుభూతులను సొంతం చేసుకోవాలని కాంక్షిస్తూ, బాబా మరియు గురుజీల గురించి నాకు తెలియచేసి, నన్ను శిరిడీకి తీసుకుని వచ్చినటువంటి నా ప్రాణస్నేహితుడు కె. జితేంద్రకు నా కృతజ్ఞతలు తెలియచేస్తూ, మీ అందరితో ఇవాళ ఈ అనుభూతుల్ని పంచుకునే అవకాశం కల్పించిన బాబా-గురుజీలకు హృదయపూర్వక సాష్టాంగ నమస్కారములు తెలియచేసుకుంటున్నాను.

**-వెంకటేష్, కోట.**

## చిన్ని ఆశ-పెద్ద ఆనందం

గురుబంధువుల అనుభవాలు నిత్య స్మరణీయాలు. నాటి సాయి అంకిత భక్తుల అనుభవాలే ఈనాడు ఎందరో సాయి భక్తులకు మార్గదర్శకాలవుతున్నాయి. కులమతాలకు, పేదధనిక తారతమ్యాలకు అతీతంగా సాగే సాయియానం అనుక్షణం మధురానుభూతుల మిళితమే. ఈ అనుభవం పొందిన గురుబంధువులకు 'ఫోన్' లేదు. వాళ్ల బంధువులు వారింటికి రావడం, బంధువుల ఫోన్ ద్వారా వారి ఆనందాన్ని, వారి అవసరాలను గురుబంధువు నరేంద్రగారి ద్వారా గురువుగారికి తెలియచేయాలని వారి కుతూహలం. ఆలోచన, ఆశ వారిది-ఆ గురుబంధువుతోనే ఫోన్ చేయించి, వారి అవసరాలు, తాను తెలుసుకున్నానన్న అధికారిక రాజముద్ర గురుదేవులది.

**- గురుకృప**

శ్రీ బాబూజీ పాదాలకు నమస్కరిస్తూ, నాపేరు రేణుక. మాది బోధన్. నేను ఒక చిన్న గ్రామంలో స్కూల్ టీచర్‌గా వర్క్ చేస్తున్నాను. ఒకరోజు మా చెల్లెలు శ్రీలత నరేంద్ర అన్నయ్యకి ఫోన్ చేసింది. కానీ ఫోన్ రింగ్ అయ్యి, కట్ అయిపోయింది. మళ్లీ ప్రయత్నించింది. మళ్లీ రింగ్ అయ్యి, హలో అనగానే కట్ అయిపోయింది. మా చెల్లెలు చాలా బాధ పడింది. నేను ఆరోజు సాయంత్రం స్టడీకి వెళ్లి వచ్చాను. నేను రావడం చూసి మా చెల్లెలు పరిగెత్తుకుంటూ వచ్చి ఆ బాధని నాతో చెప్పుకుంది. కాని నేను అలసిపోవడం వలన అంతగా పట్టించుకోలేదు. తను చాలా బాధపడి సాయంత్రం సత్సంగానికి వెళ్లి గురువుగారితో ఇలా చెప్పుకుంది. గురువుగారు నేను రేపు మళ్లీ మీకు ఫోన్ చేస్తాను. తప్పకుండా మీరు నాతో మాట్లాడాలి అని. మరుసటి రోజు ఉదయం 6 గంటల ప్రాంతంలో మాకు ఫోన్ వచ్చింది. ఆ ఫోన్ ఎక్కడ నుండో అని అనుకొని అక్కయ్య ఫోన్ లిఫ్ట్ చేసింది. హలో ఎవరు? అని అడిగింది. నేను నరేంద్రని అని అన్నయ్య



అనగానే మాకు ఎక్కడలేని సంతోషం, ఆనందం కలిగాయి. ముందుగా అన్నయ్య మా చెల్లెలుతో మాట్లాడారు. ఏంట్రా విశేషాలు అని అడిగారట. మాకు చాలా ఆనందం వేసింది. అలా అన్నయ్య దాదాపు 15 నుండి 20 నిమిషాలు మాతో మాట్లాడారు. ఇంకా అన్నయ్య ఏమన్నారంటే ఈ ఫోన్ ఎలా వచ్చిందో నాకు తెలియడం లేదు అని అన్నారు. నిజంగా గురువుగారికి మామీద ఎంత ప్రేమ అని ఆనందం వేసింది. గురువుగారికి మా మీద ఉన్న ప్రేమ చూస్తుంటే ఆనందంతో డాన్స్ వేయాలని అనిపించింది. ఇంత ఆనందాన్ని ప్రసాదించిన గురువుగారికి పాదాభివందనం తెలియచేసుకుంటూ... **– రేణుక, బోధన్.**

## సమస్య-సమాధానం-సంతృప్తి

ఒక చక్కటి కుటుంబం. అమ్మా, నాన్న, పిల్లలు, మనవళ్లు, మనవరాళ్లు. తరానికొక ఆలోచన. కానీ, వరాలిచ్చే దైవం మాత్రం ఒక్కరే! అది పూజ్యశ్రీ బాబూజీ. గురుదేవుల దర్శనం చేసుకోవాలన్న ఆదుర్దా చెల్లిది. బిడ్డకు గురుదేవుల జన్మదినంనాడే జన్మనివ్వాలన్న ఆకాంక్ష అక్కది. డెలివరీ అయితే అమ్మకు కూతురు తోడుగా ఉండాలన్న ఆశ తండ్రిది........ ఇలా ప్రతీ వారికి ఒక ఆలోచన. ఈ అందమైన కథ ఎలా సాగిందని, అందరినీ గురుదేవులు ఎలా సంతృప్తి పరిచారన్న అంశం తెలుసుకోవాలన్న ఆతృత బంధువులది, గురుబంధువులది. సమస్యలెన్నైనా అందరికీ, అన్నిటికీ సమాధానం సద్గురువు శ్రీ బాబూజీనే– ఆ సన్నిధానం అందరికీ సమతృప్తిని అందించే కల్పతరువు. **– గురుకృప**

నా పేరు గాయత్రి అనిల్. మేము హైదరాబాద్‌లో ఉంటున్నాము. నాకు ఇద్దరు అక్కలు ఉన్నారు. మా రెండవ అక్కకు మొదటిసారి ప్రెగ్నెన్సీ వచ్చినపుడు తనకు డెలివరీ డేట్ అక్టోబర్ రెండవవారంలో ఇచ్చారు. మా అక్క పుట్టినరోజు అక్టోబర్ 7 కావడంతో అక్క నాతో చెప్పింది. ఏమనంటే తనది, అక్టోబర్ 7 పుట్టినరోజు, గురువుగారిది కూడా అదేరోజు కాబట్టి బాబు కూడా ఆరోజు పుట్టేలా ఆశీస్సుల కోసం గురువుగారికి లెటర్ వ్రాయమని నాతో చెప్పింది. ఆ సంవత్సరం విజయదశమి అక్టోబర్ 15న వచ్చింది. నేను అప్పటికే శిరిడీకి రిజర్వేషన్ చేయించుకున్నాను. కానీ మా నాన్నగారు నువ్వు శిరిడీకి వెళ్లేలోపే అక్క డెలివరీ అయితే రిజర్వేషన్ క్యాన్సిల్ చేయించుకో, లేకుంటే అమ్మకు ఒక్కదానికి ఇబ్బంది అవుతుంది అని చెప్పారు. ఇక్కడ మూడు సమస్యలు వచ్చాయి. 1. అక్క కోరిక ప్రకారం గురువుగారికి లెటర్ వ్రాయాలి,



తన కోరిక తీరాలి. 2. నాన్నగారి మాటను కాదని శిరిడీకి వెళ్లలేను. 3. కానీ వెళ్లకుండా ఆగలేను. నాకు గట్టిగా గురువుగారి దర్శనం చేసుకోవాలని మనసులో ఉంది. చివరకు ఉన్నవన్నీ గురువుగారికి లెటర్ వ్రాసాను. నేను విజయదశమికి వెళ్లే రోజుకు అక్క డెలివరీ కాలేదు. కాబట్టి నాన్నగారు కూడా ఏమీ అభ్యంతరం చెప్పలేదు. కాని అక్క మాత్రం అక్టోబర్ 7న డెలివరీ కాలేదని చాలా ఫీల్ అయ్యింది. నా ప్లాన్ ప్రకారం నేను శిరిడీకి వెళ్లిపోయాను. మా జిల్లా వారికి నామం చెప్పే అవకాశం విజయదశమి రోజున మధ్యాహ్నం 12 నుండి 2 వరకు. నేను ఆరోజు నామంలో గురువుగారిని చాలా వేడుకున్నాను. నేను శిరిడీకి రావాలని గట్టిగా అడగటం వలన అక్క కోరిక నెరవేరలేదేమో. తనకు మంచి చేయండి. అని గురువుగారిని ప్రార్థించాను. నేను శిరిడీ వచ్చిన తరువాత 4 రోజుల వరకు ఇంటికి ఫోన్ కూడా చేయలేదు. (సేఫ్‌గా చేరానని చేసాను తప్ప) ఫోన్ చేస్తే ఎక్కడ అక్క డెలివరీ అయ్యింది ఇంటికి వచ్చెయ్యమని చెబుతారేమోనని. కాని ఆయన సద్గురుమూర్తి ఆలోచన ఎక్కడ? మన ఆలోచన ఎక్కడ? విజయదశమి తరువాత రోజు ఉదయం గురుస్థాన్ నుండి నేను రూమ్‌కి వస్తుండగా మా పెదనాన్న కనిపించి, ఇంటికి అసలు ఫోన్ చేయలేదా? అని అడిగారు. లేదు అని చెప్పాను. నేను ఇప్పుడే మాట్లాడాను. నాన్నగారు నిన్ను ఫోన్ చేయమని చెప్పారు అని చెప్పారు. భయపడుతూనే వెళ్లి ఫోన్ చేసాను. అప్పుడే తెలిసింది ఒక శుభవార్త. అక్క డెలివరీ అయ్యింది. విజయదశమి రోజు మధ్యాహ్నం 1 గం॥ ప్రాంతంలో. నిజంగా నా సంతోషానికి హద్దులేదు. అందరం చాలా సంతోషించాము.

గురువుగారిని మనం ఏం కోరుకున్నా ఆ కోరికను తీరుస్తారు. కాని ఆ తీర్చే విధానం వర్ణనాతీతం. మేము గురువుగారి పుట్టిన రోజే బాబు పుట్టాలని అడిగితే, ఎవరికీ ఇబ్బంది కలగకుండా అంటే నేను శిరిడీకి రావడానికి, మా అక్క కోరికను తీర్చడానికి మానాన్నగారి మాటను జవదాటకుండా ఉండటానికి దేనికీ ఇబ్బంది లేకుండా మా కోరికను తీర్చారు. ఎలా అంటే మనమంతా గురువుగారి జన్మదినాన్ని విజయదశమి పర్వదినం నాడే జరుపుకుంటాం కదా! మా కోరిక ప్రకారం బాబుకు కూడా అదేరోజు జననం ప్రసాదించారు గురువుగారు. ఇది తలచుకున్నప్పుడల్లా గురువుగారు వ్రాసిన "దేవుడే పుట్టితే సాయిరూపం" అనే పాటలో "అడిగింది ఇచ్చుటే సాయిపథం, ఆ అడగటం నేర్పుటే బాబా పథం" అన్నది గుర్తుకొస్తుంది. అది ఆయన అక్షర రూపంలోనే కాక ఆచరణ రూపంలో చూపి మనల్ని కూడా ఆ బాటలో పయనింపచేయడానికి ఆయన చేసే ప్రయత్నాలు చూస్తే ఈ ప్రపంచంలో బాబా, గురుదేవులు తప్ప ఎవ్వరూ అంత ప్రేమను పంచలేరు





అనిపిస్తుంది. ఆయన ప్రేమను నిరంతరం అనుభవిస్తూ ఉండేలా ఆశీర్వదించమని, జగద్గురువైన ఆ సాయినాథుని ప్రార్థిస్తూ, నా దైవం అయిన సద్గురు శ్రీ సాయినాథుని శరత్‌బాబూజీకి పాద నమస్కారం చేస్తూ...

**–గాయిత్రి అనిల్, సంతనూతలపాడు**

## నిశ్చింతకు నిధానం-సద్గురు సన్నిధానం

"తృప్తిని, శాంతిని, సంతోషాన్ని, నమ్మకాన్ని, నిశ్చింతను–మాటలలో వివరించలేని విధంగా మనకు అనుభవమయ్యేలా చేసేవారే సద్గురువు" అని అంటారు శ్రీ బాబూజీ. శ్రీ సాయి చెంతకు చేరిన జీవులన్నీ అట్టి శాంతిని, సంతోషాన్ని, నమ్మకాన్ని, నిశ్చింతను పొందడమే చరిత్రలో ఏ భక్తుని చూసినా మనం గమనించేది. సాయిచరిత్రకారుడైన హేమాడ్‌పంత్ సాయిని చేరడానికి ఏవో ఆటంకాలు ఎదురవుతుంటాయి. అయితే, తన ప్రథమ దర్శనం గురించి, శ్రీ హేమాడ్‌పంత్ వ్రాసిన మాటలు గమనిద్దాం. "నేను బాబా ఉన్న చోటుకి పరిగెత్తుకొని వెళ్లాను. మట్టిలో బాబా పాదాలనంటి నమస్కరించాను. ఆ క్షణంలో నాకు అవధులు లేకుండా పోయాయి". "బాబా దర్శనంతో నిజంగానే నేను ధన్యుడనయ్యాను. నా కన్నులు సార్థకమయ్యాయి, పరితృప్తి చెందాయి". "ఇదీ సాయి దర్శన మహిమ సుమా! అతని దర్శనమొక్కటే చాలు. అది సంపూర్ణంగా మార్చివేస్తుంది". సద్గురువును చేరడానికి ఏది సరైన సమయమో ఏలినవారికే ఎరుక. ఆ సన్నిధిని చేరిన క్షణం–మనసు కరగవలసిందే, మాట ఆగవలసిందే. ఎందుకంటే **సద్గురు దర్శనం మనలో అవ్యక్తంగా ఉన్న పరిపూర్ణత్వానికి అసలు రూపు కనుక. అందుకే కంటనీరు–అది అనుగ్రహ సెలయేరు.**

**– గురుకృప**

నా పేరు సతీష్. గురువుగారి దగ్గరకు చేరకముందు నేను గురువుగారిని పూర్తిగా వ్యతిరేకించేవాడిని. ఇప్పటి గురుబంధువులైన వెంకట్ మరియు కిషోర్‌లు గురువుగారి గురించి నాకు ఎంతో గొప్పగా చెబుతుండేవారు. కాని నేను మాత్రము అందుకు అంగీకరించేవాడిని కాదు. ఎందుకంటే ఒక మనిషిని మనం భగవంతుడిగా పూజించడం ఏమిటి అనే ఒక భావన ఉండేది. కాని బాబా అంటే నాకు ఇష్టమే. నేను బాబాని బాగా పూజిస్తుండే వాడిని. అందరు దేవుళ్లతోపాటు బాబాను కూడా ఒక దైవంగా పూజిస్తుండే వాడిని. గురుబంధువులైన వెంకట్, కిషోర్‌లు సత్సంగానికి రమ్మని అంటుండేవారు. కాని ఒక్కరోజైనా





సత్సంగానికి వెళ్లలేదు. నాకు 2000 సం॥లో వివాహం అయ్యింది. 2001లో మాకు ఒక బాబు పుట్టాడు. శిరిడీలో బాబా సమక్షంలో బాబుకి అన్నప్రాసన చేయించాలనుకున్నాము. అప్పటికి నేను శిరిడీ ఒకసారి కూడా వెళ్లలేదు. మా బాబు అన్నప్రాసన అనే మిషమీద మా కుటుంబం మొత్తము శిరిడీ వెళ్లాము. శిరిడీ వెళ్లిన తరువాత విజయదశమికి ముందు రోజు ఒక సంఘటన జరిగింది. అదేమిటంటే నేను బాబా సమాధి మందిరములోకి వెళ్లి బాబాను మొట్టమొదటిసారిగా ముఖ దర్శనము చేసుకున్నాము. అప్పుడు బాబాను చూడగానే నాకు కళ్లవెంట నీళ్ళు కారినవి. నాకు తెలియకుండానే ఆయనమీద ప్రేమ వలన ఏడ్చేసాను. అక్కడి నుండి నేను రూంకి వెళ్లాను. అప్పుడు వెంకట్ వచ్చి ఇప్పుడు గురువుగారు సత్సంగానికి వస్తారు. సత్సంగం టైమ్ అవుతుంది. రూమ్‌లో చేసేదేముంది సరదాగా అక్కడకు రావచ్చు కదా అని అన్నాడు. సరేలే ఒకసారి వెళ్దాము అని అనుకొని సత్సంగం జరుగుతున్న ప్రదేశానికి వచ్చాము. అప్పుడు సత్సంగం హాల్ అంతా నిండిపోయింది. బయట సత్సంగం హాల్ గోడ ప్రక్కన చాలా మంది ఉన్నారు. అక్కడ బాబా నామ సంకీర్తన జరుగుతుంది. నేను కూడా అక్కడే నిలుచుని వారితోపాటుగా బాబా నామసంకీర్తన చేస్తున్నాను. ఇంతలో గురువుగారు సాయియానా లోపల నుండి వచ్చి డయాస్ ఎక్కారు. నేను మొట్టమొదటిసారిగా గురువుగారిని చూచింది అదే. గురువుగారిని చూచిన వెంటనే నాకు తెలియకుండానే బాబాను చూచినపుడు ఏ విధంగా కంట నీరు వచ్చిందో అదే విధంగా నేను ఏడ్చేసాను. అప్పటినుండి నాకు ఏం జరిగిందో తెలియదు. ఆనాటినుండి ఈనాటి వరకు ఎన్నోసార్లు గురువుగారిని దర్శించుకుంటూ ఉన్నాను. నేను మొట్టమొదటిసారిగా బాబాను శిరిడీలో సందర్శించడం, గురువుగారిని మొదటిసారి దర్శించడం, సాయిపథంలో అడిగిడడం అన్నీ ఒక్కరోజునే జరిగినవి. అంతేకాకుండా విజయదశమి రోజున మా బాబుకి గురువుగారిచేత అన్నప్రాసన చేయించాము. అంతేకాకుండా తరువాత మా బాబుకి పేరు మరియు అక్షరాభ్యాసము అన్నీ గురువుగారే చేశారు. మా బాబుకి సాయిజ్ఞానేశ్వర్ అనే పేరు పెట్టారు. ఇలా నా కోర్కెలన్నీ తీరుస్తూ, నా ఆర్థిక ఇబ్బందులను కూడా తీర్చి, నా జీవితానికి మంచి సెటిల్‌మెంట్ ఇవ్వడమే కాకుండా, ఆపద సమయాల్లో నా వెన్నంటి ఉండి నాకు రక్షణ కల్పిస్తూ, నన్ను ప్రతిక్షణం కంటికి రెప్పలా కాపాడుతూ, ప్రేమతో పూర్తిగా నన్ను కట్టి పడేశారు గురుదేవులు. నన్ను తల్లిలా ఆదరించి, తండ్రిలా నా అవసరాలు, కోరికలు తీరుస్తూ, బాబాను చేరేందుకు నాకు మార్గదర్శియై నన్ను సరియైన, సులభమైన మార్గంలో పయనింపచేస్తున్న పూజ్యగురుదేవులకు నా నమస్సుమాంజలి.

**–సతీష్, ఒంగోలు**





# ఊదీ-ఉత్తరం-ఉపశమనం

నాపేరు ఆర్ స్వామి. మాది బోధన్. నేను మొదట్లో సత్సంగానికి ఆరతి సమయాల్లో వెళ్లేవాడిని. అప్పుడు సత్సంగం అంటే పెద్ద ఆసక్తి లేదు. నాకు అప్పట్లో ప్రతిరోజూ విపరీతంగా కడుపునొప్పి వచ్చేది. ఒకరోజు మన గురుబంధువు కిరణ్‌కి నా బాధ చెప్పాను. అతను బాబా ఊదీ నీళ్లలో కలుపుకొని త్రాగమన్నాడు. నేను అలా చేయడం వలన ప్రతిరోజూ వచ్చే నొప్పి 2,3 రోజులకు ఒకసారి వస్తుంది. మళ్లీ కిరణ్‌కి చెప్పాను. అతను గురువుగారికి లెటర్ వ్రాయమన్నాడు. లెటర్ వ్రాస్తే నొప్పి తగ్గుతుందా అనే సందేహం వచ్చింది. అప్పటికి ఇంకా గురువుగారిని దర్శించుకోలేదు. అంతలో నిజామాబాద్ సత్సంగ వార్షికోత్సవము వచ్చింది. నేను లెటర్ వ్రాసి, బోధన్ శ్రీనివాస్ అన్నయ్యకు ఇచ్చాను. మంగళగిరి రాధాకృష్ణగారి ద్వారా నా లెటర్ తిరువణ్ణామలై చేరింది. ఆ రోజు నుండి మళ్లీ నాకు కడుపునొప్పి రాలేదు. గత సంవత్సరం గురువుగారి ఫోటో ముందు చెప్పుకున్నాను. ఆగష్ట్ నెలలో గురువుగారు తిరువణ్ణామలై వచ్చారు. నాకు గురువుగారిని చూడాలని కోరిక కలిగింది. నేను సత్సంగ హాల్‌కి వెళ్లి గురుదేవా నాకు మిమ్మల్ని చూడాలని ఉంది నాకు మీ దర్శనం కావాలని అని అలానే చాలా సేపు కూర్చున్నాను. తరువాత రోజు ప్రసన్న సార్‌గారు మా ఇంటికి వచ్చారు. "మేము కుటుంబంతో తిరువణ్ణామలై వెళుతున్నాము, మాకు రూట్ సరిగ్గా తెలియదు. ఇది వరకు నువ్వు వెళ్లావు కదా కాబట్టి నువ్వు మాతో రావాలి అని అన్నారు". వారితోపాటు నేను తిరువణ్ణామలై వెళ్లాను. వారు అక్కడ నరేంద్ర సార్‌తో వాళ్ల సమస్యను చెప్పుకొని ఆ మరుసటిరోజు వారు తిరుగుప్రయాణం చేసారు. వాళ్లకి గురువుగారి దర్శనం కాలేదు. నన్ను నరేంద్రసార్ ఉండమన్నారు. నేను హ్యాపీగా పది రోజులపాటు ఆనందంగా తిరువణ్ణామలైలో గడిపాను. అక్కడ ఒక చిన్న కోరిక కలిగింది. గురువుగారిని పూండీలో చూడాలి అని. ఆరోజు రాత్రి గురువుగారు పూండీ వెళుతున్నారని నరేంద్రసార్ చెప్పారు. మేము పూండీకి వెళ్లాము గురువుగారు వచ్చారు. గురువుగారితోపాటు పూండీలో పూండీస్వామికి ప్రదక్షిణ చేసాం. గురువుగారు 10ని॥ల పాటు ధ్యానంలో కూర్చొన్నారు. అప్పుడు నేను గురువుగారి వెనుక కూర్చొనడం వలన గురువుగారిని సరిగ్గా దర్శించుకోలేకపోయాను. ధ్యానం అయిపోయిన తరువాత గురువుగారు కారులో కూర్చొన్నారు. అప్పుడు నేను, హైదరాబాద్ హరి అన్నయ్య ఇద్దరం కారుడోరు దగ్గర నిలుచుని ఉన్నాము. గురువుగారు నన్ను చూసారు నేను చెప్పినదంతా విన్నారు. గురువుగారిని అంత దగ్గరగా చూడడం, గురువుగారు నేను చెప్పినదంతా విని సరే అన్నారు. అప్పుడు నా ఆనందానికి హద్దులు లేవు. ఈ జన్మకు ఇది చాలు అనిపించింది. మళ్లీ గురువుగారిని ఇంటి వద్ద దర్శించుకున్నాను. ఆరోజు గురువుగారు ప్రతి ఒక్కరిని చాలాసేపు చూసారు.

**-ఆర్.స్వామి, బోధన్**



# రసస్పందన

సద్గురూ! నీ చిత్రం ఈ చిత్తంలో రూపుదాల్చింది. నాటినుండి ఏదో తెలియని వేడి, అంతులేని వడి. నీ పదాల వెంట, నీ పాదాల చెంతనే మా జీవనం సాగాలన్న యెద సవ్వడి. ప్రభూ! మీరు చెప్పే ప్రతి మాట మాకు శృతి వాక్యమయ్యేలాగున మమ్ము ఆశీర్వదించండి. ఎందుకంటే అర్థవంతమైన జీవితానికి అర్థం మీరు. మీ జీవితమే మాకు మార్గదర్శకం, మీ ప్రతి అడుగు మాకు అనుసరణీయం. యువతను వివేకానంద వాణిని ఆస్వాదించమని ఆశీర్వదించిన మీకు సాయిపథం యువత కైమోడ్పులర్పిస్తోంది. వివేకానందుని వాణికి సద్గురుపథంలో ఉన్న ప్రాధాన్యతను అవగతం చేసుకొనే ప్రయత్నం చేస్తే శరీరం గగుర్పొడుస్తోంది. 'పరిపూర్ణ వ్యక్తిత్వమనే' పట్టుకొమ్మగా సాయిపథం యువత నిలవాలనేందుకు వివేకానందుని చరిత్ర ఇచ్చే ప్రేరణ మమ్ము సద్గురు పథంలో ఎన్నో అడుగులు వేయించగలదని మాకవగతమవుతోంది. సద్గురు పథంలో సాగే యువత ఎన్నో మార్గదర్శకాలను అందుకోవడానికి వివేకానందవాణిని తప్పక అవధరించవలసిందే!

వివేకానందునికి శ్రీ రామకృష్ణుల పట్ల ఉన్న ప్రేమను, గురుపథాన్ని ఈ జగత్తంతా చాటి ప్రతీ మనిషిని కర్తవ్య కార్యోన్ముఖులను చేయాలన్న సదాశయాన్ని, లక్ష్యాన్ని చేరడంలో ఎదురయ్యే అవరోధాలను ఎదుర్కోవడంలో ప్రతి మనిషికి ఉండవలసిన ఓరిమి గురువుపట్ల ఉండవలసిన అంకితభావం– ఇలా మనం నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో దాగి ఉన్నాయి. (ఈ క్రింది మాటలు ఏ గురుబంధువునయినా ఇబ్బంది పెడితే క్షమించమని వేడుకుంటున్నాం గురుదేవులను. పూజ్య గురుదేవుల సత్యనిష్ఠ, సాయిపట్ల వారికున్న శరణాగతి తత్త్వం, ప్రజలందరూ సాయితత్త్వాన్ని తెలుసుకోవాలన్న ఆకాంక్షను ఆస్వాదిస్తే శ్రీబాబూజీ– వివేకానందునిలా ఈ భువికి ఏతెంచిన ఒక సంస్కరణ సామ్రాట్టుగా అన్పించకమానదు.) ఒక చక్కటి బోధతో కూడిన సంఘటనతో మనం వివేకానందుని చరిత్రను మననం చేసుకుందాం.

నరేంద్రుడు దక్షిణేశ్వరానికి వచ్చినపుడల్లా ప్రేమతో దగ్గరకు వెళ్లే శ్రీ రామకృష్ణులు ఒక దశలో నరేంద్రుడి పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తారు. ఒకరోజు నరేంద్రుడు రామకృష్ణుల వద్దకు వచ్చి ప్రణామం చేసి వారి ముందే కూర్చొంటాడు. కానీ, ఎట్టి మాటలు ఉండవు రామకృష్ణుల నుంచి. చాలా సేపు నిరీక్షించి, మరలా కాసేపాగి వచ్చి కూర్చుంటారు. అదే తీరు రామకృష్ణులది. చివరకు రామకృష్ణులకు ప్రణామం చేసి, ఆరోజు సాయంత్రం ఇల్లు చేరతాడు నరేంద్రుడు. రెండవసారి... మూడవసారి... ఇలా నెలరోజులు గడిచాయి.





ఎట్టి మార్పుండదు రామకృష్ణుల వైఖరిలో!. కానీ నరేంద్రుడు మాత్రం దక్షిణేశ్వరానికి రావడం, రామకృష్ణులను దర్శించడం మానడు. ఒకరోజు రామకృష్ణులే నరేంద్రుని ఇలా అడిగారు "సరే! నేను ఒక్క మాటకూడా నీతో మాట్లాడలేదు. అయినప్పటికీ, నువ్వు ఇక్కడకు వస్తూనే ఉన్నావు. ఎందుకు అలా చేస్తున్నావు?" అందుకు నరేంద్రుడు " మీతో మాట్లాడటం కోసమా నేను ఇక్కడకు వస్తున్నది? మీరంటే నాకెంతో ఇష్టం. మిమ్మల్ని చూడగోరి మాత్రమే నేను ఇక్కడకు వస్తున్నాను." సద్గురు దర్శనానికి ఉన్న ప్రాధాన్యత, ఆ దర్శనాన్ని మనం అర్థం చేసుకోవాల్సిన తీరుకు ఒక చక్కటి భాష్యమే కదా ఈ సంఘటన.

సర్వ జీవ స్వరూపుడైన సాయి ఏ విధంగా అయితే చరాచరజీవులన్నింటిలో తానున్నానని బోధించారో అట్టి వైనాన్ని గమనిద్దాం నరేంద్రుని చరిత్రలో. ఒకానొక ఉత్సవ సందర్భంలో రామకృష్ణులు ఇలా వచిస్తారు. " భగవన్నామంలో రుచి, జీవులందరి పట్ల దయ, భాగవతుల సేవ ఈ మూడు గుణాలు అలవరచుకోవాలి. నామము, నామి ఇద్దరూ వేరు కాదని భక్తిప్రపత్తులతో ఆయన నామాన్ని జపించాలి. విశ్వం యావత్తూ దైవానికి చెందినదేనని హృదయపూర్వకంగా విశ్వసించి, జీవులందరిపట్ల కరుణ వహించాలి." ఇలా చెపుతూ భావపారవశ్యంలోకి వెళ్ళి, సాక్షికమైన స్మృతిలో ఇలా అన్నారు. "జీవుల పట్ల దయకాదు చూపవలసింది వారిని సాక్షాత్తూ దైవంగా ఎంచి సేవించాలి" అని. ఈ మాటల అంతరార్థాన్ని అక్కడ వారెవ్వరూ అవగతం చేసుకోలేకపోయారు. ఆ సందర్భంలో వివేకానందుని ఈ మాటలు గమనిద్దాం "ఆహా! గురుదేవుల వచనాలలో ఈరోజు నేను ఎంత అద్భుత ప్రకాశాన్ని చూడగలిగాను! శుష్కమైనదని, కఠినమైనదని, అపార్థం చేసుకోబడే అద్వైత జ్ఞానాన్ని, భగవద్భక్తితో సమన్వయం చేశారు గురుదేవులు. పరమ సత్యాన్ని చేరుకోగలిగే సరిక్రొత్త మాధుర్యాన్ని ఆయన ఈరోజు చూపించారు." కేవలం అన్నిటినీ త్యజించి, అరణ్యాలకు పోయి మాత్రమే సాధించగలిగే అద్వైత జ్ఞానాన్ని జనావాసంలో ఉంటూ కూడా సాధించవచ్చుననే అద్భుతకార్యాన్ని రామకృష్ణులు తేటతెల్లం చేశారని వచిస్తారు వివేకానందస్వామి. రామకృష్ణుల వచనాలను మనిషి పరిధులలో అత్యున్నతస్థాయిలో అవగతం చేసుకొన్నది శ్రీ వివేకానందులే అనడంలో ఎట్టి సంకోచమూ లేదు. లోకోత్తరమైన రామకృష్ణుల వాణిని దశదిశలా విన్పించిన మహాత్ముడు శ్రీ వివేకానందస్వామి. మౌలికమైన ఆధ్యాత్మిక సూత్రాలెన్నటికి మారవు. అట్టి ఆధ్యాత్మిక సూత్రాలు మానవ జీవితానికి మార్గదర్శకాలు. అందుకే గురుదేవులు తరచుగా చెప్పే వేమన మాట 'ఇహము లేదు. పరమేగలదను వారి మాట కల్లమాట'. అంతే కాదు ఆధ్యాత్మికత అంటే 'ఆనందంగా జీవించడమేనని' గురుదేవులు చూపే సాయిబాట.





గురుబంధువుల్లారా! శ్రీ రామకృష్ణులు సమాధి చెందే ముందు జరిగిన ఈ క్రింది సంఘటనలు ప్రతీ మానవుని అంతరాంతరాళాలను స్పృశించి కన్నీటి పర్యంతం చేయకమానవు. అలాగే సద్గురుభక్తుల సంయమనం, శ్రద్ధా మనలను కదిలించక మానవు. శ్రీ రామకృష్ణులకు గొంతుప్రణం క్యాన్సర్ అని తేలిన పిదప పథ్యపానాదులనందించేందుకు, సేవించేందుకు నరేంద్రుడే బాధ్యతను స్వీకరించారు. అదిచూసి ఉత్సాహపూరితమైన యువకులు కొందరు ముందుకు వచ్చారు. వారంతా భగవత్సాక్షాత్కారమనే మహోన్నత జీవితాదర్శం కోసమే జీవించాలనే ధృఢ సంకల్పంతో జీవిస్తున్న యువకులు. శ్రీరామకృష్ణుల పరిత్యాగం, పావన వచనాలు, సాంగత్యం వల్ల పొందిన స్ఫూర్తితో, నరేంద్రుని అంకిత భక్తితో తన్మయులైన వారు శ్రీరామకృష్ణులను సేవించడంలో మనసా, వాచా, కర్మణా లీనమయిపోయారు. ఈ సేవా వ్రతుల సంఖ్య క్రమంగా నాలుగురెట్లు పెరిగిందంటే వారి అంకితభావాన్ని, మనం ఊహించవచ్చు. ఇటు సేవకు యువసన్యాసులు సిద్ధపడితే, ఖర్చుతోకూడిన వైద్యం చేయించడానికి ఎట్టి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి గృహస్థి శిష్యులు సిద్ధమయ్యారు. ఏ రూపమయితే వారికి అనిర్వచనీయమైన ఆనందాన్ని, శాంతిని, నిశ్చింతను ప్రసాదించిందో, పాశ్యాత్య విద్యాప్రభావంతో జడంగా మారిన జీవులలో 'ఆధ్యాత్మికత' అనే జిజ్ఞాసను రేకెత్తించి సత్యపథంవైపుకు తోడ్కొని పోతోందో అట్టి ఆ రూపానికి ఇబ్బంది కలడగం సహించని గృహస్థులు, వారి ఇళ్లను కుదువపెట్ట సిద్ధమయ్యారు. ధన, కనకాలను లక్ష్యపెట్టనే లేదు. ఏ భక్తునికీ తన భవిష్యత్తును గూర్చిన సంశయము లేదు. వారు కుటుంబ ఖర్చులను తగ్గించుకొని, రామకృష్ణుల సేవ చేసుకునేందుకు సంసిద్ధమయ్యారు. రామకృష్ణుల వ్యాధిని భక్తులు భిన్నరకాలుగా అవగతం చేసుకున్నారు. కొందరు శారీరకధర్మమని, నిగూఢమైన ఒక అవతార కార్యమని, నిజమైన వ్యాధి కాదని, అది వారి సంకల్పమేనని, ఇలా... భిన్న మనస్తత్వాలతో, విభిన్న అభిప్రాయాలతో ఎలాఉన్నా ఒక్క విషయంలో మాత్రం వారంతా ఏకభావంతో ఉన్నారు. అది **"గురుదేవుల బోధనల మేరకు తమ జీవితాను గడపగలిగితే వారి అనుగ్రహానికి పాత్రులై జీవిత పరమావధిని చేరుకోగలం".**

ఒకానొక రోజున నరేంద్రుడు రామకృష్ణుల వద్దకు వెళ్లి" నాకు మూడు, నాలుగు రోజుల సమాధి స్థితిని ప్రసాదించమని వేడుకున్నాడు". అందుకు రామకృష్ణులు "సిగ్గుచేటు, నువ్వు ఒక మర్రి వృక్షంలా ఎదిగి, సంసార తాపంతో వాడిపోతున్న వేలాదిమందికి నీడనిస్తావని ఆశించాను. కానీ, నువ్వు స్వకీయ ముక్తిని కోరుతున్నావని మందలించి, నీ కుటుంబానికి కావలసిన ఏర్పాట్లు చేసిరా! నీకు సమాధికంటే



ఉన్నతమైన స్థితిని ఇస్తానని" చెపుతారు. ఇంటికి వెళ్లిన నరేంద్రుడు చదువును ప్రారంభించ యత్నిస్తారు. ఏదో ఒక తెలియని ఆవేదన తనను చుట్టి హృదయం పగిలేలా విలపిస్తారు. వెంటనే వెర్రివానిలా గురుదేవుల వద్దకు పరిగెత్తుతూ వెళ్లి తనను ఇక ఈ బాధ్యతల నుంచి విముక్తుడ్ని చేసి ఆయన పాదాల చెంతనే ఉంచుకొమ్మని వేడతాడు. **"గురువును విడిచి ఒక్కక్షణమైనా ఉండలేని నరేంద్రుని ఈ స్థితి గురువుకు–శిష్యునికి మధ్య ఉండే బాంధవ్యాన్ని తేటతెల్లం చేస్తుంది".**

ఇంతలో రామకృష్ణులకు వచ్చిన వ్యాధి, అంటు వ్యాధి అని వదంతి వ్యాపిస్తుంది. దానితో కొందరు ఆయనను సమీపించడానికి, సేవించడానికి సంకోచించారు. ఇది చూసి నరేంద్రుడు అందరినీ రామకృష్ణుల గదిలో సమావేశ పరిచి, రామకృష్ణులు త్రాగి వదిలివేసిన జావను అందరి సమక్షంలో త్రాగి, అది అంటువ్యాధి కాదని, అందరికీ స్పష్టం చేసారు. సత్యంపట్ల నరేంద్రునికి ఉన్న విశ్వాసానికి ఆచరణపూర్వకమైన చర్యగా మనం ఈ విషయాన్ని దర్శించవచ్చు.

అవి సుమారుగా 1886వ సం॥. ఆగష్ట్ 14, 15వ తేదీలు. ఒకరోజు శ్రీ రామకృష్ణులు నరేంద్రుడ్ని తమ వద్దకు రమ్మని, తన చెంత కూర్చొండబెట్టుకొని తదేకంగా చూస్తూ, సమాధిమగ్నులైనారు. కాసేపట్లో నరేంద్రుడు తన దేహంలో విద్యుచ్ఛక్తి వంటి ఒక శక్తి ప్రసరించడం గమనించారు. మెల్లమెల్లగా బాహ్య స్మృతిని కోల్పోయారు. కళ్లు తెరచి చూసేసరికి రామకృష్ణులు కన్నీటి ధారలలో మునిగి కూర్చొని ఉండడం కన్పిస్తుంది. కారణమేమిటని అడిగిన నరేంద్రునితో శ్రీ రామకృష్ణులు " నా సమస్తాన్ని నేడు నీకు ధారాదత్తం చేసి, నేను బికారినైపోయాను. ఈ శక్తుల మూలంగా నువ్వు లోకానికి ఎంతో మేలు చేయబోతావు. ఆ తరువాతే నువ్వు ఎక్కడినుంచి వచ్చావో అక్కడికే తిరిగిపోతావు" అని చెబుతారు. ఇక ఆ తర్వాత నరేంద్రుని ద్వారా ఈ లోకానికి జరిగిన హితం జగమెరిగిన సత్యం. 1886వ సం॥ ఆగష్ట్ 16వ తేదీ రాత్రి ఒంటిగంట రెండు నిమిషాలకు శ్రీ రామకృష్ణులు పెదవులపై చిరునవ్వుతో సమాధిస్థితిలోనికి వెళ్లారు. శ్రీ రామకృష్ణులు నరేంద్రునికి చెప్పిన మాటలు – "నరేన్! నా బిడ్డల నందరినీ నీ బాధ్యతలో వదిలిపోతున్నాను. అందరిలోకి బుద్ధిశాలివి, ప్రతిభావంతుడవూ నువ్వే! ప్రేమతో అందరికీ నేతృత్వం వహించు. నా కోసం పనిచేయి!" శ్రీ రామకృష్ణుల ఈ బాధ్యతను నరేంద్రుడు స్వీకరించిన తీరు, భారతావనిని ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న తపనకు నరేంద్రుని మొక్కవోని పట్టుదల ఎలా ఉపయోగపడిందో, సద్గురువాణిని ఈ జగమంతా నరేంద్రుడు ఏ విధంగా పంచి, ఎందరి జీవితాలను ప్రభావితం చేసాడో, రాబోయే సంచికలో పంచుకుందాం.

**–గురుకృప**

**సాయి సమగ్ర దర్శిని : www.saibaba.com**

**గురుతత్త్వ దర్శిని : www.guruji.org**

**గురుబంధువులు అనుభవాలను పంపవలసిన చిరునామా :**

**gurukrupa@saimail.com**




గురు చరితమే కావ్యం
గురునామమే మంత్రం   గురురూపమే ధ్యేయం
గురుస్మరణమే సకలం   గురు ధ్యానమే సర్వం
గురుమార్గమే గమ్యం   గురు కీర్తనే గానం
గురువాక్కే సత్యం   గురు రక్షణే నిత్యం
గురుచరణమే లక్ష్యం